

## ప్రపంచంలోనే అతిపెద్ద క్రూయిజ్ షిప్

- టైటానిక్ కన్నా ఐదు రెట్లు పెద్దది
- ఈ నెల 27న ప్రారంభం

న్యూయార్క్, జనవరి 3: ఈ నెలాఖరులో మెగా అరంగేట్రానికి ప్రపంచంలోనే అతిపెద్ద క్రూయిజ్ షిప్ 'ఐకాన్ ఆఫ్ ద సీస్' సిద్ధమవుతున్నది. తుది మెరుగులు, తనిఖీల కోసం అరేబియన్‌కు చేరుకుంది. చూడగానే వావ్ అనిపించే ఈ అద్భుతమైన క్రూయిజ్ షిప్ ఒకప్పుడు ప్రపంచ వ్యాప్తంగా పేరొందిన టైటానిక్ కన్నా ఐదు రెట్లు పొడవైనది. ఈ నెల 27న ప్రయాణానికి అందుబాటులోకి రానుంది. ఈ క్రూయిజ్ నౌక 365 మీటర్ల పొడవు, 2,50,800 టన్నుల బరువు కలిగి ఉంది. రెండు బిలియన్ డాలర్ల వ్యయంతో నిర్మించిన ఈ క్రూయిజ్‌లో 5,610 మంది ప్రయాణికులతో పాటు 2,350 మంది సిబ్బంది ఉంటారు. 30 డెక్‌లు, ఒక ఫుడ్ హాల్, ఆరు పూల్స్, రిసార్టు గేట్‌వే, అతి పెద్ద వాటర్ పార్క్‌లతో పాటు అత్యాధునిక సౌకర్యాలు ఇందులో ఉన్నాయి.

## కొత్త క్రిమినల్ ట్రెండ్ 'సైబర్ కిడ్నాప్'

- అమెరికా, ఇతర రీజియన్లలో పెరుగుతున్న ఘటనలు

వాషింగ్టన్, జనవరి 3: నేటి ఆధునిక యుగంలో టెక్నాలజీ ఎంత కొత్తపుంతలు తొక్కుతున్నదో అదేవిధంగా సైబర్ నేరగాళ్లు అదే సాంకేతికతను ఉపయోగించుకొని మోడర్న్ స్టైల్‌లో నేరాలకు పాల్పడుతున్నారు. ఇటీవలి వరకు ఆన్‌లైన్ మోసాలు, మాల్వేర్‌లు చొప్పించడం వంటివి జరుగుతుండగా.. తాజాగా సైబర్ నేరాల అడ్డాలో 'సైబర్ కిడ్నాపింగ్' అనే ట్రెండ్ నడుస్తున్నది. అమెరికాతో పాటు పలు ఇతర ప్రాంతాల్లో సైబర్ కిడ్నాపింగ్ ఘటనలు వెలుగుచూడటం ఆందోళన కలిగిస్తున్నది. ఇటీవల అమెరికాలో జువాంగ్ అనే 17 ఏండ్ల చైనా విద్యార్థి ఫిజికల్‌గా కాకుండా సైబర్ కిడ్నాప్‌నకు గురయ్యాడు. అనంతరం అతని కుటుంబం నుంచి నిందితులు డబ్బులు వసూలు చేశారు. బాధిత విద్యార్థిని పోలీసులు చిన్న అటవీ ప్రాంతం నుంచి కాపాడారు.

### సైబర్ కిడ్నాపింగ్ అంటే?

ఇతర ఆన్‌లైన్ మోసాల మాదిరిగానే సైబర్ కిడ్నాపింగ్ ఇటీవలి కాలంలో పెరుగుతున్న డిజిటల్ నేరంగా మారుతున్నది. సైబర్ కిడ్నాపింగ్‌లో ఆన్‌లైన్ నేరగాళ్లు బాధితులను లక్ష్యంగా చేసుకొంటారు. పలువిధాలుగా బెదిరింపులకు పాల్పడటం ద్వారా అటవీ లేదా నిర్జన ప్రాంతాలకు వెళ్లమని లేదా తమను తాము నిర్బంధంలో ఉండే విధంగా ఆదేశిస్తారు. బాధితులను వీడియో చాట్ ద్వారా పర్యవేక్షిస్తూ, వారు తీసిన ఫొటోలను బాధిత కుటుంబసభ్యులకు పంపి డబ్బులు డిమాండ్ చేస్తారు. బాధితుడి గొంతును మిమిక్రీ చేసేందుకు కేటుగాళ్లు కృత్రిమ మేథ టూల్స్‌ను కూడా ఉపయోగిస్తున్నారు.


### ఏ జాగ్రత్తలు తీసుకోవాలి?

కిడ్నాపర్లు ఎవరైనా సంప్రదిస్తే వెంటనే కమ్యూనికేషన్ కట్ చేసి, పోలీసులకు సమాచారం అందించాలని అమెరికా సైబర్ సెక్యూరిటీ ఏజెన్సీ సూచించింది. అదేవిధంగా నేరగాళ్లకు డబ్బులు పంపొద్దని, పూర్తి అవగాహనతో ఇలాంటి నేరాలను అరికట్టొచ్చని నిపుణులు చెబుతున్నారు. ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాల్లో సున్నిత సమాచారం తస్కరణకు గురికాకుండా సెక్యూరిటీ యాప్‌లు వినియోగించాలని పేర్కొన్నారు. సాఫ్ట్‌వేర్‌ను రెగ్యులర్‌గా అప్‌డేట్ చేసుకోవాలని, డివైజ్‌లకు మాల్వేర్ రక్షణ జోడించాలని, అనుమానిత పాపప్ లింకులను క్లిక్ చేయకూడవని, అదేవిధంగా హ్యాకర్లకు దొరక్కుండా బలమైన పాస్‌వర్డ్‌లు పెట్టుకోవాలని సూచిస్తున్నారు.

# దేశంలో క్యాన్సర్ భూతం!

**ఆసియాలోనే రెండో స్థానంలో భారత్**

- 2019లో 12 లక్షల కొత్త కేసుల నమోదు
- మహమ్మారితో 9.3 లక్షల మంది మృతి
- లాన్సెట్ అధ్యయనంలో వెల్లడి



న్యూఢిల్లీ, జనవరి 3: భారత్‌ను క్యాన్సర్ భూతం పీడిస్తున్నది. ఏటా ఈ ప్రాణాంత వ్యాధి బారిన పడుతున్న వారు, మరణిస్తున్న వారి సంఖ్య లక్షల్లో ఉంటున్నది. 2019లో భారత్‌లో 12 లక్షల కొత్త క్యాన్సర్ కేసులు నమోదయ్యాయని, 9.3 లక్షల మంది ఆ మహమ్మారితో మరణించారని లాన్సెట్ తాజా అధ్యయనం పేర్కొన్నది. అధిక కేసులు, మరణాల సంఖ్య నమోదవుతున్న దేశాల జాబితాలో భారత్ ఆసియాలో రెండో స్థానంలో ఉన్నదని తెలిపింది. ఈ మేరకు అధ్యయన వివరాలు లాన్సెట్ రీజినల్ హెల్త్ సౌత్‌ఈస్ట్ ఆసియా జర్నల్‌లో ప్రచురితమయ్యాయి. ఆసియాలో భారత్‌తోపాటు చైనా, జపాన్ లోనూ క్యాన్సర్ కోరలు చాస్తున్నదని అధ్యయనం పేర్కొన్నది. మొత్తంగా ఆసియాలో ప్రజారోగ్యానికి పెనుముప్పుగా మారిందని, 2019లో 94 లక్షల కొత్త కేసులు నమోదు కాగా, 56 లక్షల మంది మరణించారని పరిశోధకులు వెల్లడించారు.

### టీబీఎల్ కేసులు, మరణాలు ఎక్కువ

పరిశోధకుల బృందంలో కురుక్షేత్ర ఎన్ఐటీ, జోధ్‌పూర్, బఠిండా ఎయిమ్స్‌లకు చెందిన వారు ఉన్నారు. 1990 నుంచి 2019 మధ్య 49 ఆసియా దేశాల్లోని 29 రకాల క్యాన్సర్ తీరుతెన్నులపై పరిశీలన చేశామని పరిశోధకులు అధ్యయన పత్రంలో పేర్కొన్నారు. ఆసియాలో టీబీఎల్(శ్వాసనాళం, ఊపిరితిత్తుల సంబంధిత) క్యాన్సర్ ప్రభావం అధికంగా ఉన్నదని, 13 లక్షల కొత్త కేసులు, 12 లక్షలు మరణాలు నమోదయ్యాయని వివరించారు. టీబీఎల్ క్యాన్సర్ పురుషుల్లో ఎక్కువగా ఉన్నదని, మహిళల్లో గర్భాశయ సంబంధిత క్యాన్సర్ ముప్పు అధికంగా ఉన్నదని పేర్కొన్నారు. మొత్తంగా ఆసియాలో టాప్-5 క్యాన్సర్ల జాబితాలో టీబీఎల్, రొమ్ము క్యాన్సర్, సీఆర్సీ, పొట్ట సంబంధిత క్యాన్సర్, నాన్ మెలనోమా క్యాన్సర్ ఉన్నాయి. క్యాన్సర్‌కు కారణమయ్యే 34 రిస్క్ ఫ్యాక్టర్లలో పొగ, మద్యం తాగడం, కాలుష్యం ప్రధానంగా ఉన్నాయని పరిశోధకులు తెలిపారు.

### ప్రజారోగ్య ముప్పుగా పొగాకు ఉత్పత్తులు

భారత్, బంగ్లాదేశ్, నేపాల్ వంటి దక్షిణాసియా దేశాల్లో ఖైనీ, గుట్కా, పాన్ మసాలా వంటి పొగాకు ఉత్పత్తులు ప్రజారోగ్యంపై పెను ప్రభావం చూపుతున్నట్టు పరిశోధకులు పేర్కొన్నారు. ప్రపంచంలో భారత్‌లోనే నోటి క్యాన్సర్ బాధితుల సంఖ్య అధికంగా ఉన్నదని వెల్లడించారు. 2019లో ప్రపంచ నోటి క్యాన్సర్ మరణాల్లో 28.1 శాతం భారత్‌లో చోటుచేసుకోగా, ఈ విధమైన క్యాన్సర్ కొత్త కేసులు దేశంలో 32.9 శాతం రికార్డు అయ్యాయని తెలిపారు. 50 శాతం నోటి క్యాన్సర్ కేసులకు పొగాకు ఉత్పత్తులే కారణమని ఆందోళన వ్యక్తం చేశారు. పొగాకు ఉత్పత్తుల(స్మోక్‌లెస్ టొబాకో) వల్ల నోటి క్యాన్సర్ మాత్రమే కాకుండా అన్నవాహిక, పాంక్రియాటిక్ క్యాన్సర్ బారిన పడే అవకాశం ఉన్నదని హెచ్చరించారు.

**లక్షల్లో కేసులు.. మరణాలు**

| దేశం | కొత్త కేసులు | మరణాలు |
|---|---|---|
| చైనా | 48 లక్షలు | 27 లక్షలు |
| భారత్ | 12 లక్షలు | 9.3 లక్షలు |
| జపాన్ | 9 లక్షలు | 4.4 లక్షలు |

2019లో ఆసియాలో కొత్త క్యాన్సర్ కేసుల నమోదు- **94** లక్షలు

మరణించిన వారి సంఖ్య- **56** లక్షలు

## రూ.10,300 కోట్లకు పైగా కొట్టేశారు!

- 2021నుంచి సైబర్ నేరగాళ్లు దోచుకున్న మొత్తమిది..

న్యూఢిల్లీ: దేశంలో సైబర్ కేటుగాళ్లు రెచ్చిపోతున్నారు. ఇండియన్ సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్ బుధవారం వెల్లడించిన వివరాల ప్రకారం, 2021 ఏప్రిల్ 1 నుంచి 2023 డిసెంబరు 31 వరకు సైబర్ నేరగాళ్లు మన దేశం నుంచి రూ.10,319 కోట్లు దోచుకున్నారు. దర్యాప్తు సంస్థలు దీనిలో దాదాపు రూ.1,127 కోట్ల మేరకు మన దేశంలోనే బ్లాక్ చేయగలిగాయి. దీనిలో 9-10 శాతం వరకు బాధితుల ఖాతాల్లో తిరిగి జమ చేయగలిగాయి. నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్‌లో 2021లో 4.52 లక్షల కేసులు నమోదు కాగా, 2022లో 9.66 లక్షలు, 2023లో 15.56 లక్షల కేసులు నమోదయ్యాయి. భారత్‌లో జరుగుతున్న సైబర్ దాడుల్లో 50 శాతం వరకు విదేశాల నుంచే జరుగుతున్నాయి. కాంబోడియా, వియత్నాం, చైనా, ఇతర దేశాల్లోని ముఠాలు ఈ దాడులకు పాల్పడుతున్నారు.

## 'మోదీ సెల్ఫీ బూత్' వివాదం.. అధికారిపై బదిలీ వేటు!

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, జనవరి 3 (నమస్తే తెలంగాణ): 'మోదీ సెల్ఫీబూత్' వివాదంలో కీలక పరిణామం చోటుచేసుకొన్నది. బూత్‌ల ఏర్పాటుకైన ఖర్చుపై సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ) కింద సమాచారమిచ్చిన సీనియర్ అధికారిపై బదిలీ వేటు పడింది. సెంట్రల్ రైల్వే జోన్ చీఫ్ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ (సీపీఆర్‌వో) శివరాజ్ మానస్పురె స్థానంలో కొత్తగా స్వప్నిల్ డీ నీలాను రైల్వేశాఖ నియమించింది. అలాగే, ఆర్టీఐ ద్వారా అడిగే ప్రశ్నలకు ఇచ్చే సమాధానాలను రైల్వే జోనల్ జనరల్ మేనేజర్ (జీఎం) లేదా డివిజనల్ రైల్వే మేనేజర్ తప్పనిసరిగా ఆమోదించాలని ఆ ఆదేశాల్లో పేర్కొంది.

**అసలేం జరిగిందంటే..**

దేశంలోని దాదాపు 50 రైల్వే స్టేషన్లలో రైల్వేశాఖ ఇటీవల 'మోదీ 3డీ సెల్ఫీ బూత్'లను ప్రారంభించింది. వీటిలో 20 బూత్‌లు శాశ్వతమైనవి కాగా, మరో 30 తాత్కాలికమైనవి. ఈ క్రమంలో సెల్ఫీ బూత్‌ల ఏర్పాటుకు ఎంత ఖర్చయిందంటూ ఇటీవల ఓ ఆర్టీఐ కార్యకర్త రైల్వేశాఖకు లేఖ రాశారు. ఈ ప్రశ్నపై స్పందించిన సెంట్రల్ రైల్వే డిప్యూటీ జనరల్ మేనేజర్ అభయ్ మిశ్రా.. ఒక్కో శాశ్వత బూత్ ఏర్పాటుకు రూ. 6.25 లక్షలు, తాత్కాలిక బూత్ ఏర్పాటుకు రూ. 1.25 లక్షల చొప్పున మొత్తంగా రూ. 1.63 కోట్లు ఖర్చయినట్టు సమాధానమిచ్చారు. దీంతో ప్రజల సొమ్మును అధికార పార్టీ బీజేపీ రాజకీయ ప్రచారానికి వినియోగించిందంటూ ప్రతిపక్షాలు ధ్వజమెత్తాయి. ఈ క్రమంలోనే డిప్యూటీ జనరల్ మేనేజర్‌కు పై అధికారి అయిన సీపీఆర్‌వోను రైల్వేశాఖ బదిలీ చేసినట్టు పలువురు ఆరోపిస్తున్నారు.

## ట్రక్కులో వేధింపులు.. కిందకు దూకేసిన బాలికలు

**గుజరాత్‌లో ఘటన**

ఛోటాడేపూర్ (గుజరాత్), జనవరి 3: ఆకతాయిల వేధింపులు తట్టుకోలేక ఆరుగురు బాలికలు నడుస్తున్న ట్రక్కు లోంచి దూకిన ఘటన గుజరాత్‌లోని ఛోటాడేపేర్ జిల్లాలో జరిగింది. వారు దూకిన వెంటనే ట్రక్కు అదుపు తప్పి బోల్తాపడింది. నిందితుడు ఒకరిని పోలీసులు పట్టుకున్నారు. మరో ఐదుగురి కోసం గాలిస్తున్నారు. పోలీసుల కథనం ప్రకారం.. సంకేడ తాలుకాలోని గ్రామంలో నివసిస్తున్న ఆరుగురు బాలికలు అక్కడకు ఐదు కిలోమీటర్ల దూరంలోని స్కూల్‌లో చదువుకుంటున్నారు. మంగళవారం స్కూల్ అయిన తర్వాత యథాప్రకారం పికప్ ట్రక్కులో కూర్చున్నారు. దారిలో డ్రైవర్ సురేష్ సహా అప్పటికే వ్యాన్‌లో ఉన్న మరి కొందరు వారిని వేధించడం ప్రారంభించారు. అప్పటికే నిందితులు బాలికల దగ్గర ఉన్న నగదు, వస్తువులు లాక్కున్నారు. దీంతో తమను తాము రక్షించుకోవడానికి బాలికలు వ్యాన్ నుంచి దూకేశారు.

## యూకే బాలికపై వర్చువల్ గ్యాంగ్‌రేప్

న్యూఢిల్లీ: బహుశా ప్రపంచంలో ఇదే తొలి కేసు అయి ఉంటుంది. 16 ఏళ్ల యూకే బాలిక ఆన్‌లైన్‌లో సామూహిక అత్యాచారానికి గురైంది. బాలిక ఫిర్యాదుతో పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. వర్చువల్ రియాలిటీ హెడ్‌సెట్‌తో మెటావర్స్‌లో గేమ్ ఆడుతుండగా ఆమె అవతార్(డిజిటల్ క్యారెక్టర్)పై గుర్తుతెలియని వ్యక్తులు లైంగికదాడికి పాల్పడ్డారు. భౌతికదాడి జరగనప్పటికీ ఆమె తీవ్ర మనస్తాపం చెందిందని, భౌతిక లైంగికదాడికి గురైన భావనలో ఉందని పోలీసులు తెలిపారు. ఇలాంటి కేసును దర్యాప్తు చేయడం ప్రపంచంలోనే ఇది తొలిసారి.

## మీడియా కథనాల తర్వాతే అద్వానీకి ఆహ్వానం: శెట్టర్

బెంగళూరు: బీజేపీ అగ్ర నేత ఎల్‌కే అద్వానీని రామాలయం ప్రారంభోత్సవానికి ఆహ్వానించిన తీరును కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి, కాంగ్రెస్ నేత జగదీశ్ శెట్టర్ తీవ్రంగా విమర్శించారు. అయోధ్యలో రామాలయం నిర్మాణం కోసం అద్వానీ ఎంతో కృషి చేశారన్నారు. మీడియాలో కథనాలు వచ్చిన తర్వాత మాత్రమే ఆయనకు శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ ఆహ్వానం పంపిందన్నారు. వయసును దృష్టిలో ఉంచుకుని, ఇంటి వద్ద నుంచే ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని చూడాలని ఆయనకు చెప్పారన్నారు. ఇది ఎలా ఉందంటే, రమ్మని పిలిచి, శుభలేఖ ఇవ్వకపోవడంలా ఉందన్నారు.

## స్పేస్ ఎక్స్ రాకెట్‌తో భారత ఉపగ్రహ ప్రయోగం

న్యూఢిల్లీ: ఖగోళ ప్రయోగాల్లో సత్తా చాటుతున్న ఇస్రో భారీ సమాచార ఉపగ్రహం 'జీశాట్-20' ప్రయోగాన్ని నిర్వహించేందుకు అమెరికన్ ప్రైవేట్ సంస్థ 'స్పేస్ ఎక్స్'పై ఆధారపడనున్నది. 'స్పేస్ ఎక్స్'కు చెందిన 'ఫాల్కన్-9' రాకెట్ ద్వారా ఈ ఏడాది ద్వితీయ త్రైమాసికంలో ఈ ఉపగ్రహాన్ని నింగిలోకి పంపనున్నది. భారీ ఉపగ్రహ ప్రయోగం కోసం భారత్ 'ఫాల్కన్' రాకెట్‌ను ఉపయోగించనుండటం ఇదే తొలిసారి.

